పత్రికాప్రకటన కాకినాడ, 22.4.2019

జాతీయ ఉపాధి హామీ పథకం క్రింద జిల్లాలోని అన్ని మండలాల్లో పెద్ద సంఖ్యలో కూలీలకు వేతన ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా మండల, డివిజనల్ అధికారులను ఆదేశించారు.

సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్తికేయ మిశ్రా జిల్లా, డివిజనల్, మండల అధికారులు, బ్యాంకర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఉపాధి హామీ పనులు, వివిధ ప్రోజెక్ట్ పనుల పురోగతి, గృహనిర్మాణ కార్యక్రమాలు, సంక్షేమ కార్పొరేషన్ ఋణాల పంపిణీ, సీజనల్ వ్యాధుల నివారణ, కాకినాడ స్మార్ట్ సిటీ పనుల ప్రగతి తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ప్రతి రోజు లక్షా 40 వేల మంది కూలీలు ఉపాధి పనులలో పాల్గొంటున్నారని, రానున్న 60 రోజుల్లో కూలీల దినసరి సగటు హాజరును 2 లక్షలకు మించి పెంచి అధిక వేతన కాంపోనెంట్, తద్వారా అధిక మెటీరియల్ కాంపోనెంట్ సాధించాలని ఆదేశించారు. పెద్దాపురం, రామచంద్రపురం, రాజమండ్రి, కాకినాడ డివిజన్లతో పాటు ముఖ్యం ఏజెన్సీ మండలాల్లో ఇప్పటికే చేపట్టిన పనులను ముమ్మరం చేసి అధిక సంఖ్యలో కూలీలకు వేతనాలు కల్పించాలని సూచించారు.

వివిధ అభివృద్ధి ప్రోజెక్ట్ పనుల ప్రగతిని సమీక్షిస్తూ ఎన్‌హెచ్-216 జాతీయ రహదారి విస్తరణలో ప్యాకేజి-3 పనులను, అమలాపురం బైపాస్ పనులను జూన్ లోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పాకేజి-4 లో ఇంకా మట్టిపనులే జరుగుతుండటం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎడిబి రోడ్ విస్తరణలో చెట్ల తొలగింపు ప్రక్రియను, సేకరించిన భూమికి చెల్లింపులను ముమ్మరం చేయాలని సూచించారు. భూమి సేకరించి అప్పగించినా, మోరంపూడి ఫ్లై ఓవర్ మినహా మిగిలిన 4 ఫ్లై ఓవర్ల పనులు చేపట్టేందుకు ఎన్‌హెచ్ విభాగం ఎటువంటి సన్నాహాలు చేయకపోవడం పట్ల అసంతృప్తి వెలిబుచ్చారు. కాకినాడ నగరంలోని కొండయ్యపాలెం ఆర్‌ఓబి వంతెన పనుల్లో రైల్వే శాఖ పనులు పూర్తి కావస్తున్నా, ఆర్ అండ్ బి శాఖ పనులు ఎటువంటి పురోగతి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటిమొగ వద్ద హైలెవెల్ వంతెన పనుల కొరకు భూసేకరణ ముమ్మరం చేయాలని కాకినాడ ఆర్‌డిఓను ఆదేశించారు. భారత్‌మాల బీచ్ రోడ్ జాతీయ రహదారిలో రెండు చోట్ల అలైన్‌మెంట్ ఖరారుపై జేసి-2, ఆర్‌డిఓలు తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని కోరారు. కాకినాడ స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్‌లో భాగంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వివిధ సేవలు, సదుపాయాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. స్మార్ట్ రోడ్-1 పనుల్లో సర్పవరం నుండి భానుగుడి వరకు ఉన్న నిడివి రహదారి అభివృద్ధి, సుందరీకరణ పనులు నెలాఖరులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే ఇదే రోడ్‌లో బాలయోగి విగ్రహం నుండి నగరంలోకి ప్రవేశించే రోడ్‌లోని డివైడర్లలో మొక్కల పెంపకం, రంగులు వేయడం వెంటనే చేపట్టాలని ఆదేశించారు. బోట్ బిల్డింగ్ యార్డు, గోదావరి కళాక్షేత్రం పనులు ముమ్మరం చేయాలని, సైన్ సెంటర్, ఈట్ స్ట్రీట్, కెనాల్ ఫ్రంట్ సుందరీకరణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

సంక్షేమ కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రగతి సమీక్షలో ఎస్.సి., బి.సి, కార్పొరోషన్ లబ్దిదారులకు 2018-19 లక్ష్యం క్రింద అకౌంట్లలో సబ్సిడీ ఇప్పటికే జమ చేయడం జరిగిందని, బ్యాంకులు లోన్ డిస్బర్స్‌మెంట్ వెంటనే జరిపి, అసెట్ల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఇందుకు ఆర్‌డిఓలు, సబ్‌కలెక్టర్లు బ్యాంకర్లు, యండిఓలు, మున్సిపల్ కమీషనర్లతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కోరారు.

హౌసింగ్ సమీక్షలో పూర్తిచేసిన గృహాల సంఖ్య పరంగా జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందని, లక్ష్య సాధన శాతం పరంగా రెండవ స్థానంలోను ఉందన్నారు. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసి లక్ష్య సాధనలో ముందు నిలపాలని జిల్లా కలెక్టర్ కోరారు. అర్బన్ హౌసింగ్ కార్యక్రమాల క్రింద పూర్తి చేసిన గృహసముదాయాలలో లబ్దిదారులు నివాసం ఉండేందుకు అవసరమైన కనీస సౌకర్యాలను సత్వరం కల్పించాలని టిడ్‌కో అధికారులకు సూచించారు.

సీజనల్ వ్యాధుల నివారణ కార్యాచరణలో భాగంగా ఏజెన్సీ గ్రామాల్లో దోమల నివారణ మందు స్ప్రేయింగ్ కార్యక్రమాలను విస్తృతంగాను, ఉధృతంగాను నిర్వహించాలని ఆదేశించారు. అలాగే అన్ని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలకు సంబంధించి ఏప్రియల్ నెలలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.

వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు అందిన మీకోసం అర్జీలపై అవసరమైన చర్యలు చేపట్టి పెండెన్సీని నివారించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్-2 సిహెచ్.సత్తిబాబు, డిఆర్‌ఓ యం.వి.గోవిందరాజులు, కాకినాడ మున్సిపల్ కమీషనర్ కె.రమేష్, జడ్‌పి సిఈఓ విద్యాసాగర్, హౌసింగ్ పి డి జి.వి.ప్రసాద్, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి కిషోర్, బిసి కార్పొరేషన్ ఈడి ఎస్‌విఎస్ సుబ్బలక్ష్మి, ఎల్‌డియం బివి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)